సాక్షి
అన్నమయ్య జిల్లా
మంగళవారం । 18 । జూన్ । 2024



చెక్కు చెదరని కట్టడం

శతాబ్దం దాటినా ఇంకా చెక్కుచెదరని నిర్మాణాలు చరిత్రకు ఆనవాళ్లుగా, భవిష్యత్తులో గతాన్ని తెలిపే సాక్ష్యాలుగా నిలుస్తున్నాయి. -8లో



మొక్కు తీర్చుకుని వస్తుండగా...

పోరుమామిళ్ల సమీపంలోని మద్దిమాను గుర్రప్పస్వామి వద్ద మొక్కు తీర్చుకుని వస్తుండగా రోడ్డుప్రమాదంలో ఇద్దరు మృతి చెందారు. మరో ఇద్దరు గాయపడ్డారు. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.690	రూ.800
రెండోరకం	రూ.500	రూ.680

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 396 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

బ్యాక్‌లాగ్ సీట్ల ప్రవేశ పరీక్ష మార్పు

కలికిరి: జిల్లాలోని మహాత్మా జ్యోతిరావు పూలే వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల పాఠశాలల్లో బ్యాక్ లాగ్ సీట్ల భర్తీకి నిర్వహించే ప్రవేశ పరీక్షలో మార్పులు చోటు చేసుకున్నట్లు జిల్లా కన్వీనర్ ప్రిన్సిపాల్ వై.సోమశేఖర్ తెలిపారు. 6 నుంచి 9వ తరగతిలో ప్రవేశానికి ఈ నెల 20న ప్రవేశ పరీక్ష నిర్వహించాల్సి ఉంది. అయితే 6, 8వ తరగతుల వారికి 20న మధ్యాహ్నం 3 నుంచి 5.30 గంటల వరకు, 7, 9వ తరగతుల వారికి 21న మధ్యాహ్నం 3 నుంచి 5.30 గంటల వరకు ప్రవేశ పరీక్ష జరుగుతుందన్నారు. అభ్యర్థులు మార్పును గమనించాలన్నారు. పరీక్షకు 3.10 గంటలకు పైబడి వచ్చిన వారిని అనుమతించేది లేదన్నారు. అభ్యర్థులు హాల్ టిక్కెట్లను ఆన్‌లైన్‌లో పాఠశాల వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. హాల్‌టిక్కెట్లు పోస్టులోగానీ, నేరుగా గాని ఇవ్వడం జరగదని తెలిపారు. మరిన్ని వివరాలకు 9885225352, 8790092069 నంబర్లల్లో సంప్రదించాలని పేర్కొన్నారు.

టమాట @ 80



మదనపల్లె మార్కెట్‌కు వచ్చిన టమటాలు

మదనపల్లె సిటీ: టమాట ధరలు రోజు రోజుకు పుంజుకుంటున్నాయి. మదనపల్లె మార్కెట్‌లో సోమవారం మొదటి రకం కిలో రూ. 80, రెండో రకం కిలో రూ.68 పలికింది. 396 మెట్రిక్ టన్నుల కాయలు వచ్చాయి. పంట దిగుబడులు తగ్గడం.. అందుకు తగ్గ డిమాండ్ ఉండటంతో ధరలు క్రమేపి పెరుగుతున్నాయి. అలాగే ఇటీవల కురుస్తున్న వర్షాలకు పంట దిగుబడి తగ్గిపోయింది. మార్కెట్ నుంచి తమిళనాడు, ఒరిస్సా, తెలంగాణ రాష్ట్రాలకు ఎగుమతి అవుతున్నాయి. ధరలు పెరుగుతుండటంతో రైతులు టమట పంట సాగుపై ఆసక్తి చూపుతున్నారు.

నూతన నియామకం



కరుణాకర్ ఆరమడక

మదనపల్లె: ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అన్నమయ్యజిల్లా అధ్యక్షుడిగా మదనపల్లెకు చెందిన డాక్టర్.కరుణాకర్ ఆరమడక నియమితులయ్యారు. ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు జేఎస్.రాజేంద్ర, కేంద్ర కార్యదర్శి వాసవిలు సోమవారం డాక్టర్.కరుణాకర్ ఆరమడకకు నియామకపత్రం అందించారు. జూన్ 17, 2024 నుంచి జూన్ 16, 2025 వరకు ఏడాది కాలంపాటు ఆయన ఈ పదవిలో కొనసాగుతారు. ఆంధ్రప్రదేశ్‌లో సినీహబ్ నిర్మాణానికి ఫిలిం ఛాంబర్ ఆఫ్ కామర్స్ కృషి చేస్తోందని రాష్ట్ర అధ్యక్షులు జే.ఎస్.రాజేంద్ర తెలిపారు. ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అన్నమయ్యజిల్లా అధ్యక్షుడిగా తనను నియమించిన రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులకు డాక్టర్.కరుణాకర్ ఆరమడక కృతజ్ఞతలు తెలిపారు.

త్యాగానికి ప్రతీక బక్రీద్

జిల్లా వ్యాప్తంగా ముస్లింల ఈద్ ప్రార్థనలు



ధార్మికోపన్యాసం చేస్తున్న మౌలానా జలాలుద్దీన్ సాహెబ్



మదనపల్లె: ఈద్గాలో ముస్లింల సామూహిక ప్రార్థనలు

రాయచోటి: ప్రపంచ ముస్లిం లోకం అత్యంత పవిత్రంగా భావించే ఈద్ ఉల్ జుహా పండుగ (బక్రీద్)ను సోమవారం జిల్లావ్యాప్తంగా ముస్లింలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం 6.30 గంటలకు ప్రారంభమైన ప్రత్యేక ప్రార్థనలు మధ్యాహ్నం వరకు కొనసాగాయి. పలువురు భక్తులు తమ సమీపంలోని మసీదుల్లో జరిగే ప్రార్థనల్లో పాల్గొనగా, అధికశాతం మంది ఈద్గాలకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. సోదరభావం.. దానం, సాయం, త్యాగం వంటి సుగుణాలను ఈ పండుగ ప్రతిబింబింపచేస్తుందని, సమస్త మానవాళికి ఆదర్శనీయమని ముస్లిం మైనార్టీ మత పెద్దలు బోధన చేశారు.సమాజహితమే పండుగల లక్ష్యం కావాలని జామియా మసీదు ఇమామ్ మౌలానా జలాలుద్దీన్ అన్నారు. ఈ వేడుకల్లో భాగంగా రాయచోటిలోని ఈద్గా మైదానంలో రాష్ట్ర రవాణా యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, రాజంపేటలో ఎమ్మెల్యే అమరనాథరెడ్డి, మదనపల్లెలో ఎమ్మెల్యే షాజహాన్ బాషా, వైఎస్‌ఆర్‌సీపీ మదనపల్లి ఇన్‌చార్జి నిసార్ అహమ్మద్‌లు ఆయా ప్రాంతాలలో నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనలలో పాల్గొన్నారు. బక్రీద్ పండుగను జిల్లాలోని రాయచోటి, రాజంపేట, మదనపల్లె, పీలేరు, తంబళ్లపల్లి, కోడూరు నియోజకవర్గ కేంద్రాలతో పాటు మండలం గ్రామ ప్రాంతాలలో కూడా ముస్లింలు ఘనంగా జరుపుకున్నారు. ప్రతి మనిషి తనకు ఉన్నంతలో తోటి మనిషికి సాయం అందించే స్వభావాన్ని అలవరచుకోవాలని మతపెద్దలు ప్రార్థనల సందర్భంగా తెలియజేశారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరులు ఒకరికి ఒకరు ఆలింగనం చేసుకొని పండుగ శుభాకాంక్షలు చెప్పుకున్నారు. పలువురు హిందూ సోదరుల సైతం బక్రీద్ సందర్భంగా ముస్లిం సోదరులకు పండుగ శుభాకాంక్షలు తెలిపి తమ సోదరభావాన్ని పంచుకున్నారు. ప్రార్థనలకు వచ్చిన వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఎస్పీ కృష్ణారావు ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.



రాయచోటి ఈద్గా మైదానంలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



కడప బిల్టప్ ఈద్గాలో...

కడపలో...

కడప కల్చరల్: వైఎస్సార్ జిల్లాలోని కడప, ప్రొద్దుటూరు, పులివెందుల, కమలాపురం తదితర ప్రాంతాల్లోనూ ముస్లింలు బక్రీద్‌ను భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. ఈద్గాల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

కడప బిల్టప్ ఈద్గాలో..

కడపలోని బిల్టప్ వద్దగల ఈద్గాలో నగరవాసులతోపాటు సమీప గ్రామాలకు చెందిన ప్రజలు అధిక సంఖ్యలో ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా మత గురువు ముఫ్తీ మహమ్మద్ న్యామతుల్లా పండుగ సందేశమిస్తూ దేవుడు మానవుని త్యాగ గుణాన్ని పరిశీలించడమే ఈ పండుగ పరమార్థం అన్నారు. దైవంపై తమకు గల అచంచల భక్తిని ప్రదర్శించుకునే అవకాశం ఖుర్బానీ ద్వారా లభించడం వారి వారి అదృష్టమని తెలిపారు. దైవం భక్తులకు కఠినమైన పరీక్షలు పెడతారని, అందులో నెగ్గిన వారికి మంచి జీవితం ప్రసాదిస్తారని తెలిపారు. భక్తులు అల్లాహ్ మార్గాన్ని అనుసరించి ఆయన ఇచ్చిన ఈ ప్రాణాన్ని ఆయన మార్గంలో సమర్పించేందుకు ఏమాత్రం వెనకాడకూడదన్నారు. అలాగే మనిషిలోని చెడు గుణాలను కూడా వదిలి వేయాలని తెలిపారు. త్యాగానికి ప్రతీకగా ప్రవక్త హజరత్ ఇబ్రహీం అల్లాహ్ ఆదేశాన్ని పాటించిన సంఘటన గురించి వివరించారు. అలాగే మనుషుల్లో త్యాగ గుణం పెరగాలని, దైవం పేరిట త్యాగం చేయడంతోపాటు సాటి మనుషులతో పరస్పరం సహకరించుకుంటూ ఉన్నప్పుడే ప్రశాంత జీవనం, ప్రపంచ శాంతి సాధ్యమవుతాయన్నారు. త్యాగ గుణాన్ని దైవం ఎంతో అభిమానిస్తారని, త్యాగాలు చేసే వారిపై ఆయన తన కరుణను వర్షిస్తారన్నారు. ప్రస్తుత స్థితిలో ప్రపంచమంతా నెలకొన్న అశాంతిని, అలజడిని తొలగించడానికి త్యాగం ఒక్కటే శాశ్వత పరిష్కారమని దైవం బోధించారని తెలిపారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా భక్తుల సౌకర్యార్థం విశేష ఏర్పాట్లు చేసిన కార్పొరేషన్ అధికారులు, సిబ్బందికి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. అనంతరం పెద్దదర్గా పీఠాధిపతి హజరత్ ఖ్వాజా సయ్యద్ షా ఆరిఫుల్లా హుసేని సాహెబ్ భక్తులచే సామూహిక ప్రార్థనలు చేయించారు. భక్తులు ఒకరినొకరు హత్తుకుని 'ఈద్ ముబారక్ హో' అంటూ పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

నేడు రైతు ఖాతాల్లోకి పీఎం కిసాన్ నిధులు

- వైఎస్సార్ జిల్లావ్యాప్తంగా లక్షా 87 మంది రైతులకు లబ్ధి
- రూ. 37.32 కోట్లు రైతుల ఖాతాలకు జమ



కడప అగ్రికల్చర్: ఖరీఫ్ సీజన్‌లో పంటలు సాగు చేసే ముందు రైతులకు సాగు ఖర్చుల నిమిత్తం ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి యోజన కింద మొదటి విడతలో భాగంగా ప్రతి రైతుకు కేంద్ర ప్రభుత్వం రూ. 2 వేలు నగదును రైతు ఖాతాలకు అందజేస్తుంది. ఈ సొమ్మును 18వ తేదీ మంగళవారం ప్రధానమంత్రి మోదీ బటన్ నొక్కి నేరుగా రైతు ఖాతాకు జమచేయనున్నారు. వైఎస్సార్‌జిల్లా వ్యాప్తంగా 36 మండలాల పరిధిలో లక్షా 87 మంది రైతులకు సంబంధించి రూ. 37.32 కోట్లు నగదు నేడు రైతుల ఖాతాలకు జమకానుంది.

నేడు పీఎం కిసాన్ సమ్మాన్ నిధి సాయం

ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి 17వ విడత రైతుల ఖాతాలోకి రూ. 2 వేల రుపాయల నగదు జమ ప్రత్యక్ష వీక్షణ కార్యక్రమాన్ని నేడు కడప కలెక్టరేట్ సభాభవన్‌లో ప్రసారం చేయడం జరుగుతుందని కృషి విజ్ఞాన కేంద్ర కో ఆర్డినేటర్ డాక్టర్ వీరయ్య తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి వైఎస్సార్ జిల్లాకు చెందిన దాదాపు 400 నుంచి 600 మంది రైతులు, కిసాన్ సఖిలు ప్రత్యక్ష కార్యక్రమాన్ని వీక్షిస్తారని పేర్కొన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని వారణాసిలో ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని తెలిపారు. దేశవ్యాప్తంగా ఎంపిక చేసిన వివిధ ప్రాంతాల రైతులతో ప్రత్యక్ష ప్రసారం ద్వారా సంభాషణ, తదనంతరం సభను, రైతుల నుద్దేశించి ఆయన మాట్లాడతారని తెలిపారు. జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ద్వారా ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ పొందిన కిసాన్ సఖీలకు ధృవ పత్రాలను ఈ కార్యక్రమంలో అందచేయడం జరుగుతుందని తెలిపారు. జిల్లా కలెక్టర్ విజయరామరాజుతోపాటు ప్రజాప్రతినిధులు ముఖ్య అతిథులుగా పాల్గొంటారని కేవీకే కో ఆర్డినేటర్ డాక్టర్ వీరయ్య తెలిపారు.

నేడు బర్సీ మహోత్సవం

కమలాపురం: కమలాపురం పెద్ద దర్గాగా వెలుగొందుతున్న దర్గా-ఏ-గఫారియా దివంగత పీఠాధిపతి హాజీ హజరత్ జహీరుద్దీన్ షా ఖాద్రి బర్సీ మహోత్సవాన్ని మంగళవారం పీఠాధిపతి సజ్జాద్-ఏ-నషీన్ హజరత్ ఫైజుల్ గఫార్ షా ఖాద్రి ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు దర్గా కమిటీ సభ్యులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం సాయంత్రం పీఠాధిపతి ఇంటి నుంచి భక్తులతో ఊరేగింపు జరుగుతుందని పేర్కొన్నారు.

ప్రత్యేక లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి

కడప అర్బన్: సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉన్న కేసుల పరిష్కారం కోసం నిర్వహించనున్న ప్రత్యేక లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవాధికారసంస్థ చైర్మన్ జి. శ్రీదేవి తెలిపారు. జూలై 29 నుంచి ఆగస్టు 3 వరకు కేసులు రాజీ చేసుకునేందుకు కక్షిదారులకు అవకాశం కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. నోటీసులు అందుకున్న కక్షిదారులు పూర్తి వివరాల కోసం కడపలోని న్యాయసేవా సదన్‌ను సంప్రదించాలని వారు కోరారు.

బ్యాగు..భద్రత ముఖ్యం



బ్యాగుల కొనుగోలు

- మన్నిక లేకుంటే మూన్నాళ్ల ముచ్చటే
- పునః ప్రారంభమైన పాఠశాలలు
- షాపుల్లో కొనుగోలుదారుల సందడి




మదనపల్లె సిటీ: స్కూలు బ్యాగు.. పుస్తకం నుంచి మొదలు పెన్ను, పెన్సిల్, టిఫిన్ బాక్సు ,వాటర్‌బాటిల్ తదితర వస్తువుల వరకు భద్రపరిచే బ్యాంక్. ఒకరకంగా చెప్పాలంటే పిల్లల ప్రపంచం. వారి ఆస్తి.అందుకే రోజంతా తమ భుజాలపై ఉండే బ్యాగు ఎంత భద్రంగా మన్నికగా ఉంటే విద్యార్థులు అంత సౌకర్యంగా ఉంటారు. లేని పక్షంలో అసహానికి గురవుతారు. అందుకే తల్లిదండ్రులు నాణ్యమైన బ్యాగులు కొనుగోలు చేయాలి.

- వేసవి సెలవులు ముగిశాయి. ఈనెల 13 వతేదీ నుంచి పాఠశాలలు పునః ప్రారంభమయ్యాయి. దీంతో ఆటపాటలకు ఫుల్‌స్టాప్ పెట్టిన పిల్లలు బడిబాట పడుతున్నారు. ఇక నుంచి పుస్తకాలతో కుస్తీ..అక్షరాలతో దోస్తీ కట్టనున్నారు. ఈ క్రమంలో ఫీజులు, పుస్తకాలు, బ్యాగులు, యూనిఫాం ..ఇలా ఎన్నో సమకూర్చాల్సి ఉంటుంది. ఇందుకు పెద్ద మొత్తంలోనే వెచ్చించాల్సి ఉంటుంది. అయితే ఫీజులు, పుస్తకాలు ఎంత ముఖ్యమో స్కూల్ బ్యాగు కూడా అంతే ముఖ్యం. ఎందుకంటే కనీసం ఏడాది పాటు బ్యాగు అవసరం ఉంటుంది. సుమారు 5 కేజీల నుంచి 10 కేజీల బరువున్న పుస్తకాలను బ్యాగులో సర్ది పిల్లలు దీనికి భుజానికి ఎత్తుకుంటారు. మధ్యలో తెగినా, చిరిగినా,జిప్పు ఊడినా, కుట్లు ఊసినా పిల్లలకు ఇబ్బందే. సాధారణంగా చాలా మంది పిల్లలు ఇంటికి చాలా దూరంలో ఉన్న పాఠశాలలకు వెళ్తుంటారు. ఆటోలు, స్కూల్ బస్సుల్లో ప్రయాణిస్తారు. ఉదయం ఏడు గంటలకే ఇంటి వద్ద బయలుదేరితే సాయంత్రానికి ఇంటికి చేరుకుంటారు. రోజంతా పుస్తకాలు, బ్యాగుతో కుస్తీ పట్టే విద్యార్థులు అసహానికి గురవుతారు. అందుకే నాణ్యమైన బ్యాగులు కొనుగోలు చేయాలి. అప్పుడు విద్యార్థికి పాఠశాల రాకపోకల సమయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తవు. స్కూల్ బ్యాగుకు భద్రత, మన్నిక ముఖ్యం. వర్షం పడినా పుస్తకాలు తడిసే పరిస్థితి లేని భద్రత ఉండాలి. అలాగే బ్యాగు ఎక్కువ రోజులు ఉపయోగపడితేనే నాణ్యత ఉన్నట్లు. స్వల్ప వర్షానికి పుస్తకాలు తడవకుండా అన్ని కంపెనీలు జాగ్రత్తలు తీసుకుంటున్నాయి. చాలా బ్యాగులు వాటర్‌ప్రూఫ్ సదుపాయంతో వారంటీ కూడా ఇస్తున్నారు. బ్రాండెడ్ బ్యాగులు ఖరీదు రూ.600 నుంచి 1500 వరకు లభిస్తున్నాయి.

పిల్లలను ఆకర్షించడం ముఖ్యం

పిల్లలను ఆకర్షించేలా పలు రకాల బొమ్మల మోడల్స్, ఇతరత్రా ఆకర్షించే మోడళ్లను అందుబాటులో ఉంచారు. బ్యాగులోనే టిఫిన్, పెన్సిల్, పెన్నుల బాక్స్‌లు, వాటర్ బాటిళ్లు పెట్టుకునేందుకు వీలుగా ప్రత్యేక అరలు అందుబాటులో ఉంచారు. ఇంటర్, డిగ్రీ, పీజీ విద్యార్థులు వాడే బ్యాగుల్లో లాప్‌టాప్ పెట్టుకునే సదుపాయం కూడా కల్పించారు.

కొనుగోళ్ల సందడి



పాఠశాలలు పునః ప్రారంభంకావడంతో మదనపల్లెలోని ప్రధాన వీధుల్లో ఎక్కడ చూసినా బ్యాగుల కొనుగోళ్ల సందడి మొదలైంది. కేజీ నుంచి పీజీ వరకు విద్యార్థులకు అవసరమైన అన్ని రకాల బ్యాగులు మార్కెట్‌లోకి వచ్చేశాయి.

అందుబాటులో కంపెనీ బ్యాగులు:



కంపెనీ బ్యాగులు అందుబాటులో ఉన్నాయి. రూ.500 నుంచి రూ.1500 వరుకు ఉన్నాయి. తల్లిదండ్రులు బ్యాగుల కొనుగోళ్లపై ఆసక్తి చూపుతున్నారు. ధర ఎక్కువ ఉన్నా నాణ్యత చూసి స్కూల్ బ్యాగులు కొనుగోలు చేస్తున్నారు.కొత్త రకం మోడళ్లు వచ్చాయి.

-ప్రసాద్‌రెడ్డి, దివ్యభారతి బుక్ సెంటర్ యజమాని, మదనపల్లె

ఆరుద్రపైనే ఆశలు



- ఖరీఫ్ సాధారణ సాగు విస్తీర్ణం 47,855 హెక్టార్లు
- ఇప్పటికే 57,482 క్వింటాళ్ల సబ్సిడీ విత్తనాల పంపిణీ
- అదునులో పదును కోసం అన్నదాతల ఎదురుచూపులు

సాక్షి రాయచోటి: మృగశిర కార్తె ముగిసిపోయింది..ఈ కార్తెలో నైరుతి రుతు పవనాల రాకతో కొంతమేర వర్షాలు కురిశాయి. ఎండ వేడిమి నుంచి ఉపశమనం కలిగించినా భారీ వర్షం జాడ కనిపించడం లేదు. ఈనెల 20వ తేదీ తర్వాత ఆరుద్ర కార్తె ఆరంభం కానుంది. ఆరుద్ర కార్తెలోనైనా ఆశించిన మేర వర్షాలు కురిస్తే అదునులో పదును కావడం ద్వారా విత్తనం వేసేందుకు అనుకూలమైన పరిస్థితులు ఉంటాయి. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో వర్షాధారం కింద వేరుశనగ పంట సాగు చేసేందుకు అన్నదాతలు సిద్ధమయ్యారు. జూన్ తొలి వారం నుంచి జులై 15 వరకు వేరుశనగ విత్తుకోవడానికి మంచి అదునుగా వ్యవసాయశాఖ భావిస్తోంది. ఇప్పటివరకు పదునైన వర్షం లేకపోవడంతో ఆరుద్రపైనే అన్నదాతలు ఆశలు పెట్టుకున్నారు.

వేసవి దుక్కులతో సాగుకు సన్నద్ధం

అన్నదాతలు ప్రతి ఏడాది వేసవి సీజన్‌లో లోతైన దుక్కులు దున్నడం ద్వారా భూమి కొంతమేర ఆరడంతోపాటు పైరుకు అనుకూలంగా ఉంటుందని సేద్యాలు చేస్తారు. దుక్కులతోపాటు ఎరువులను కూడా తోలి భూమిలో చల్లి విత్తతం వేసేందుకు ఏర్పాట్లు చేస్తారు. ప్రతి ఏడాది ఖరీఫ్‌లో వేరుశనగ పంటను వర్షాధారం కింద సాగు చేస్తూ వస్తున్నారు. అయితే క్రమంగా ధరల సమస్య, కూలీల, ఎరువుల ఖర్చులు పెరగడం, పంటపై పెట్టుబడులు భారీగా రావడం, దిగుబడులు తగ్గిపోతుండడంతో సాగు కూడా ఏడాదికేడాది తగ్గుతూ వస్తోంది.



ఖరీఫ్‌లో వేరుశనగ సాగుకు పొలాన్ని సిద్ధం చేస్తున్న దృశ్యం



వేరుశనగ విత్తనాలను సిద్ధం చేస్తున్న అన్నదాత (ఫైల్)


జిల్లాలో 47,885 హెక్టార్లలో సాధారణ సాగు

అన్నమయ్య జిల్లాలో ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి 47,885 హెక్టార్లలో సాధారణ సాగు కింద వ్యవసాయశాఖ అంచనాలు రూపొందించింది. వర్షాధారం కింద వేరుశనగ పంట లక్ష ఎకరాలకు పైగా సాగయ్యే అవకాశం ఉన్నట్లు లెక్కలు చెబుతున్నాయి. అయితే గత ఖరీఫ్‌లో వర్షాలు సరిగా లేక పంట 15,388 హెక్టార్లలో మాత్రమే సాగైంది. ఈసారి కూడా అదునులో పదును వర్షం కురిస్తే వ్యవసాయశాఖ రూపొందించిన అంచనాల ప్రకారం వేరుశనగ పంట సాగయ్యే అవకాశం ఉంది. రుతు పవనాల నేపథ్యంలో పది రోజుల కిందట కురిసిన వర్షాలకు మదనపల్లె డివిజన్‌లో కొంతమేర పదునులోనే అన్నదాతలు వేరుశనగ విత్తనం సాగు చేపట్టారు.

విత్తనాల పంపిణీ

ఖరీఫ్‌లో అన్నదాతలకు ప్రభుత్వం ఇప్పటికే సబ్సిడీపై వేరుశనగ, పలు రకాల విత్తనాలను పంపిణీ చేసింది. జిల్లాలో 57,482 క్వింటాళ్ల వేరుశనగ విత్తనాలను రైతులకు అందజేశారు. అవసరమైన రైతులు రైతుభరోసా కేంద్రాల (ఆర్బీకే) ద్వారా దరఖాస్తు చేసుకోగా అర్హులైన రైతులందరికీ విత్తనాలను ప్రభుత్వం అందించింది. జిల్లాకు సంబంధించి 3-4 రకాల విత్తన కాయలను సకాలంలో అందించింది భారీ వర్షాలు కురిసి పదును అయినా మరుక్షణం నుంచి భూమిలో విత్తేందుకు రైతులు సిద్ధంగా ఉన్నారు. ఏది ఏమైనా ఈసారి ఖరీఫ్ సీజన్‌అయినా అన్నదాతల సాగుకు కలిసి రావాలని ఆశిద్దాం.

విత్తనకాయలు రైతులకు అందించాం



ఈనెలలో వర్షాలు రాగానే విత్తన పనులు చేపట్టాలి. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా 57 వేల క్వింటాళ్లకు పైగా వేరుశనగ కాయలను రైతులకు అందించాం. ఈ ఖరీఫ్‌లో సుమారు 47 వేల హెక్టార్లకు పైగా వేరుశనగ పంట సాగవుతుందని అంచనా వేస్తున్నాం. రైతన్నలు కూడా ఎప్పుడు వర్షం వచ్చినా విత్తనం వేసేందుకు సిద్ధంగా ఉన్నారు. ఇప్పటి నుంచి జులై నెలాఖరు వరకు వేరుశనగ విత్తనం విత్తుకోవచ్చు. – చంద్రా నాయక్, జిల్లా వ్యవసాయశాఖ అధికారి, రాయచోటి, అన్నమయ్య జిల్లా

క్లుప్తంగా

వివాహిత అదృశ్యం

మదనపల్లె : వివాహిత అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు టూటౌన్ సీఐ యువరాజు తెలిపారు. గుర్రంకొండ మండలం చెర్లోపల్లెకు చెందిన షేక్ ఇమ్రాన్, అతడి భార్య షేక్ తబస్సుమ్ సుల్తానా(19) ఇద్దరూ కలిసి ఈనెల 16న వైద్యపరీక్షల కోసం మదనపల్లెలో ఆస్పత్రికి వచ్చారు. భర్త ఇమ్రాన్ వైద్యపరీక్షల రిపోర్ట్ తెచ్చేందుకు వెళ్లి తిరిగి ఆస్పత్రికి రాగా, అతడి భార్య కనిపించలేదు. దీంతో పలుచోట్ల గాలించినా ఆచూకీ లభించకపోవడంతో బాధితుడు ఇమ్రాన్ తన భార్య అదృశ్యంపై టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఆ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

కారు బోల్తా



కారు అదుపు తప్పిన దృశ్యం

చిన్నమండెం : మండల కేంద్రంలోని బెస్తపల్లె క్రాస్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో కారు బోల్తాపడినట్లు పోలీసులు తెలిపారు. వారి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.. మదనపల్లె నుండి చిన్నమండెంకు ఏపీ 16సిజె 3699 నెంబర్ గల కారు వస్తుండగా.. బెస్తపల్లె క్రాస్ వద్దకు రాగానే అదుపు తప్పి మూడు పల్టీలు కొట్టిందన్నారు. అయితే డ్రైవర్ ఇస్లామ్ తప్ప కారులో ఎవరూ లేరు. అతడికి స్వల్ప గాయాలయ్యాయి.

బొప్పాయి లారీ దగ్ధం



విద్యుత్‌షాక్‌తో దగ్ధమవుతున్న బొప్పాయి లోడు లారీ

రైల్వేకోడూరు : మండలంలోని అనంతరాజుపేటలో సోమవారం హైటెన్షన్ వైర్ తగిలి విద్యుత్‌షాక్‌తో బొప్పాయి లారీ దగ్ధమైన సంఘటనలో మంజుల అనే మహిళా కూలి మృతి చెందింది. స్థానికుల వివరాల మేరకు.. మండలంలోని అనంతరాజుపేట వద్ద స్టీల్ ఫ్యాక్టరీకు వెళ్లే దారిలో బొప్పాయి లోడుతో వెళ్తున్న లారీకి హైటెన్షన్ వైరు తగలడంతో లారీలో పూర్తిగా మంటలు చెలరేగి దగ్ధమైంది. ఈ సంఘటనలో లారీలో ఉన్న వారంతా ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. అయితే లారీలో ఉన్న మంజుల అనే మహిళా కూలి అక్కడే మంటల్లో చిక్కుకుని ప్రాణాపాయ స్థితిలోకి వెళ్లింది. స్థానికులు చికిత్సకోసం ఆసుపత్రికి తరలించేలోపే మృతి చెందింది. ప్రమాద సంఘటన స్థలానికి పోలీసులు చేరుకుని కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

చెక్కు చెదరని కట్టడం



మద్దయ్యగారిపల్లెలోని ట్రావెలర్స్ బంగ్లా



కొండపై కలెక్టర్ హార్సిలీ తవ్వించిన బావి

- శతాబ్ద ఘన చరిత్రకు ఆనవాళ్లు
- 155 ఏళ్ల క్రితం 4,141 అడుగుల ఎత్తులో హార్సిలీహిల్స్‌పై బావి నిర్మాణం
- 113 ఏళ్ల క్రితం ట్రావెలర్స్ బంగ్లా నిర్మాణం

బి.కొత్తకోట : శతాబ్దం దాటినా ఇంకా చెక్కుచెదరని నిర్మాణాలు చరిత్రకు ఆనవాళ్లుగా, భవిష్యత్తులో గతాన్ని తెలిపే సాక్ష్యాలుగా నిలుస్తున్నాయి. బి.కొత్తకోట, పెద్దతిప్పసముద్రం మండలాల్లో బ్రిటీష్‌పాలకులు చేపట్టిన నిర్మాణాలు ఇప్పటికీ కళ్లముందున్నాయి. బ్రిటీష్ పాలనకు సాక్ష్యాలుగా ఎన్నో నిర్మాణాలున్నా కాలగర్భంలో కలిశాయి. తంబళ్లపల్లె నియోజకవర్గంలో కొన్ని కట్టడాలు ఇంకా చెక్కుచెదరకుండా గత చరిత్రను చెబుతున్నాయి.

4,141 అడుగుల ఎత్తులో బావి..

బి.కొత్తకోట మండలంలోని పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్ సముద్రమట్టానికి 4,141 అడుగుల ఎత్తులో ఉంది. బ్రిటీష్ పాలనలో కడప కలెక్టర్ డబ్ల్యుడీ. హార్సిలీ కొండను కొనుగొన్న విషయం తెలిసిందే. అయనే కొండపై నీటికోసం అప్పట్లోనే రాతి కట్టడంతో పటిష్టమైన బావిని తవ్వించాడు. 155 ఏళ్ల క్రితం హార్సిలీ కొండపై నిర్మించిన ఈ బావి నేటికి ఒక్కటంటీ ఒక్క రాయి కూడా చెక్కుచెదరలేదు. మద్రాసు ప్రభుత్వ అనుమతితో కొండను వేసవి విడదిగా, తర్వాత అతిథిగృహనిర్మాణం చేపట్టిన కలెక్టర్ హార్సిలీ నీటి అవసరాల కోసం బావిని తవ్వించాడు. ప్రస్తుత అటవీ సముదాయంలో ఈ బావి కనిపిస్తుంది. సాధారణ ప్రాంతాల్లో బావులు తవ్విస్తే పుష్కలంగా నీరు లభిస్తుంది. అదే సముద్రమట్టానికి 4,141 అడుగుల ఎత్తులోని కొండపై నీటి జాడలు కష్టం. అలాంటిది హార్సిలీ బావిని తవ్వించడంతో పుష్కలంగా నీరు అందుబాటులోకి వచ్చింది. కొండపై అప్పట్లో నిర్మాణాలకు, స్థానికులు తాగేందుకు, అవసరాలు తీర్చుకునేందుకు ఈ బావి నీరే ఆధారం. బావిని పటిష్టమైన రాయితో ఒకదానిపై ఒకటిగా పేర్చి నిర్మాణం చేశారు. ఈ నిర్మాణం ఒక అద్భుతమని అందరూ చెబుతున్నారు. ప్రస్తుతం ఈ బావి నిర్వహణలో లేకపోయినా పాడుబడలేదు. వర్షాలు కురిసే సమయంలో ఊట నీరు ఉప్పొంగి బావి నిండిపోతుంది. వేసవిలో బావి ఎండిపోతూ కనిపిస్తుంది. ఒకప్పటి కొండ నీటి అవసరాలను తీర్చిన ఈ బావి నాటి తరాన్ని గుర్తుచేసే కట్టడంగా నిలుస్తోంది.

చెక్కు చెదరని బంగ్లా..

తంబళ్లపల్లె నియోజకవర్గంలో బ్రిటీష్ పాలకులు నిర్మించిన వాటిలో భవనాలు, బ్రిడ్జీల నిర్మాణాలు కనిపిస్తాయి. పెద్దతిప్పసముద్రం మండలం మద్దయ్యగారిపల్లెలో 1911లో నిర్మించిన ట్రావెలర్స్ బంగ్లా నేటికీ చెక్కుచెదరలేదు.

ఉమ్మడిచిత్తూరు జిల్లాలోని పశ్చిమ నియోజకవర్గాలు, వైఎస్సార్ కడప జిల్లాలోని కొన్ని ప్రాంతాలు, ప్రస్తుతం కర్ణాటకలోకి బళ్లారి జిల్లా కలుపుకొని బ్రిటీష్ పాలనలో మదనపల్లె కేంద్రంగా నీటి పారుదలశాఖ ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ కార్యాలయం ఉండేది. దీని పరిధిలోకి పైన పేర్కొన్న ప్రాంతాలన్ని కలిపివుండేవి. ఈఈ తన పరిధిలోని ప్రాంతాలను సందర్శించేందుకు వెళ్లాలంటే రోజులు పట్టేవి. తిరిగి వచ్చేందుకు అంతే సమయం అయ్యేది. దీనితో మార్గమధ్యంలో విశ్రాంతి, విడిది కోసం ట్రావెలర్స్ బంగ్లాలను నిర్మించారు. పెద్దతిప్పసముద్రం మండలం మీదుగా కర్ణాటకలోకి ప్రాంతాలకు వెళ్లేటప్పుడు విశ్రాంతి కోసం 1911లో మద్దయ్యగారిపల్లెలో ట్రావెలర్స్ బంగ్లాను నిర్మించారు. అప్పటి జిల్లా ప్రజా పనులశాఖ ఆధ్వర్యంలో నిర్మాణం చేయించారు. రాతితో గోడలు, పైకప్పుగా విదేశాల నుంచి తెప్పించిన పెంకులతో నిర్మాణం చేయించారు. ఈ నిర్మాణం జరిగి 113 ఏళ్లయినా ఇప్పటికి చెక్కు చెదరలేదు. సాంకేతికత అభివృద్ధి చెందని నాటిరోజుల్లో జరిగిన ఈ నిర్మాణ నైపుణ్యం విశేషంగా చెప్పుకోవచ్చు.

భర్తపై దాడి చేసిన భార్య



భార్య చేతిలో దాడికి గురై తీవ్రంగా గాయపడిన వెంకటరమణ

మదనపల్లె : ప్రతిరోజు వేధిస్తున్న భర్తపై భార్య దాడి చేసిన సంఘటన సోమవారం కురబలకోట మండలంలో జరిగింది. తిరుపతి జిల్లా ఎర్రావారి పాలెం మండలం కోటకాడపల్లి కు చెందిన వెంకటరమణ తన భార్య జ్యోతితో కలిసి 12 సంవత్సరాల క్రితం కురబలకోట మండలం అంగళ్లు గ్రామానికి ఉపాధి కోసం వచ్చి స్థిరపడ్డాడు. ఇద్దరు భవన నిర్మాణ కార్మికులుగా పనిచేస్తున్నారు. కుమారుడు నరసింహులు సైతం భవన నిర్మాణ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. వెంకటరమణ గత కొంతకాలంగా మద్యానికి బానిసై, ప్రతిరోజు మద్యం సేవించి భార్యతో గొడవ పడేవాడు. ఈ క్రమంలో సోమవారం ఉదయం పూటుగా మద్యం సేవించి ఇంటికి వచ్చాడు. భార్యతో అకారణంగా గొడవకు దిగి, ఆమె మెడలోని తాళిబొట్టుతో గొంతు బిగించి చంపేస్తానంటూ దాడికి దిగాడు. దీంతో ఆవేశానికి లోనైన భార్య జ్యోతి సమీపంలో ఉన్న కొడవలి తీసుకుని భర్తపై దాడి చేసింది. దాడిలో వెంకటరమణ తలకు తీవ్ర గాయం కాగా, వెంటనే 108 వాహనంలో మదనపల్లి ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం తిరుపతికి రెఫర్ చేశారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరికి గాయాలు

మదనపల్లె : వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు వ్యక్తులు గాయపడి ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. సీటీఎంకు చెందిన రెడ్డివేణు (25) వ్యక్తిగత పనులపై ద్విచక్రవాహనంలో కర్నాటకకు వెళ్లి తిరిగి వస్తుండగా, ఆదివారం రాత్రి చిప్పిలి వద్ద ఎదురుగా వస్తున్న వాహనానికి సైడ్ ఇవ్వబోయి, వాహనం అదుపు తప్పి కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన స్థానికులు ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో తిరుపతికి రెఫర్ చేశారు.

కురబలకోట మండలం చేనేతనగర్‌లో నివాసం ఉన్న నారాయణ కుమారుడు సి.శంకర (40) పాలు పోసేందుకు ద్విచక్రవాహనంలో పక్కన ఉన్న గొనివారిపల్లెకు వెళ్లి వస్తుండగా, మదనపల్లె నుంచి అంగళ్లు వైపు వెళుతున్న కారు ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. ప్రమాదంలో శంకర తీవ్రంగా గాయపడగా, స్థానికులు 108 అంబులెన్స్ వాహనంలో ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. సంబంధిత పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

చీటింగ్ కేసులో అసిస్టెంట్ మేనేజర్ అరెస్ట్

మదనపల్లె : పనిచేస్తున్న ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీకి టోకరా వేసి, వసూలుచేసిన నగదుతో ఉడాయించిన అసిస్టెంట్ మేనేజర్‌ను అరెస్ట్ చేసినట్లు తాలూకా సీఐ ఎస్.శేఖర్ తెలిపారు. తమిళనాడు కరూర్‌జిల్లా సెంబియనాథం గ్రామానికి చెందిన తంగరాజు కుమారుడు టి.రామచంద్ర(38), మండలంలోని తట్టివారిపల్లె పంచాయతీ దేవతానగర్‌లో ఏఏఏ ఫైనాన్స్ కంపెనీలో అసిస్టెంట్ మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. ఈఏడాది మార్చిలో కంపెనీ మేనేజర్ 15 రోజులు సెలవుపై వెళ్లినప్పుడు ఆ సమయంలో విధులు నిర్వహించిన అసిస్టెంట్ మేనేజర్ రామచంద్ర కంపెనీ ఏజెంట్లు వసూలుచేసి ఇచ్చిన రూ.7లక్షల నగదును తీసుకుని ఉడాయించాడు. ఈ విషయమై కంపెనీ భాగస్వామి తమిళనాడు దిండిగల్‌కు చెందిన కే.కార్తీక్ తాలూకా పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేసిన సీఐ శేఖర్ సోమవారం నిందితుడైన రామచంద్రను బసినికొండ ఆంజనేయ స్వామి ఆలయం వద్ద అరెస్ట్ చేశారు. రిమాండ్ నిమిత్తం స్థానిక కోర్టులో హాజరుపరిచినట్లు చెప్పారు.

'పద్మవ్యూహంలో చక్రధారి' సినిమాను ఆదరించాలి



విలేకరుల సమావేశంలో పాల్గొన్న పద్మవ్యూహంలో చక్రధర్ సినిమా యూనిట్

కడప రూరల్ : ఈ నెల 21వ తేదీన విడుదల అవుతున్న పద్మవ్యూహంలో చక్రధారి చిత్రంను విజయవంతం చేయాలని ఆ చిత్రం యూనిట్ తెలిపారు. సోమవారం స్థానిక వైఎస్సార్ మెమోరియల్ ప్రెస్క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆ చిత్రం దర్శకుడు సంజయ్‌రెడ్డి మాట్లాడుతూ ఈ సినిమాను రాయలసీమ నేపథ్యంలో కుటుంబ ప్రేమ కథా చిత్రంగా నిర్మించామన్నారు. ఈ సినిమాను దాదాపుగా 35 రోజుల పాటు పులివెందుల ప్రాంతంలో తీశామన్నారు. రాయలసీమ అంటే కుట్రలు, కుతంత్రాలు, ఫ్యాక్షన్ నేపథ్యంలోనే సినిమాలు వస్తుంటాయన్నారు. అందుకు భిన్నంగా తాము మంచి కుటుంబ ప్రేమ కథతో సినిమాను నిర్మించామన్నారు. ఈ చిత్రానికి నిర్మాతగా కేసీ రామరాజు వ్యవహరించారని తెలిపారు. హీరో ప్రవీణ్‌రాజ్ మాట్లాడుతూ తాను రాయచోటిలో పుట్టి పెరిగానని తెలిపారు. కడప ప్రభుత్వ మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. సినీ రంగంపై మక్కువతో మంచి చిత్రంలో హీరోగా నటించినందుకు సంతోషంగా ఉందన్నారు. హీరోయిన్ శశికా మాట్లాడుతూ సినిమాను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో రచయిత శివ తదితరులు పాల్గొన్నారు.

ఆశాలకు ఇచ్చిన హామీ నెరవేర్చాలి



మాట్లాడుతున్న ఏఐటీయూసీ రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రెటరీ ఎస్. వెంకటసుబ్బయ్య

కడప వైఎస్ఆర్ సర్కిల్ : రాష్ట్ర ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన చంద్రబాబు నాయుడు ఆశా కార్యకర్తలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ఏఐటీయూసీ రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రెటరీ ఎస్. వెంకటసుబ్బయ్య, ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు పి. సుభాషిణి, ఎల్. శాంతి డిమాండ్ చేశారు. సోమవారం నగరంలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఆశాలకు కనీస వేతనం ఇస్తానని చేసిన వాగ్దానం ప్రకారం తక్షణం కనీస వేతనం ఇచ్చి జీవో జారీ చేయాలని డిమాండ్ చేశారు. ప్రమాణ స్వీకారం చేసి వారం రోజులు కాకముందే రాష్ట్రవ్యాప్తంగా ఆశా కార్యకర్తలను తెలుగుదేశం పార్టీ మండల ఇన్‌చార్జిలు వేధింపులకు గురి చేస్తున్నారని, ఉద్యోగాలు తీసివేస్తున్నామని బెదిరింపులకు దిగడం తగదన్నారు. రాష్ట్రంలో 24 గంటలు అందుబాటులో ఉంటూ గర్భవతులకు, బాలింతలకు, ప్రజలకు సేవ చేస్తున్న ఆశా కార్యకర్తలకు 8 గంటల పని విధానాన్ని అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు గుంటి వేణుగోపాల్, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు యు. మరియమ్మ, కె. కల్పన పాల్గొన్నారు.

మొక్కు తీర్చుకుని వస్తుండగా..

- కారును ఢీకొన్న ఆర్టీసీ అద్దె బస్సు
- ఇద్దరు దుర్మరణం
- భార్యాభర్తలకు తీవ్రగాయాలు



సంఘటన స్థలంలో ఆర్టీసీ అద్దెబస్సు



సంఘటన స్థలంలో నుజ్జు నుజ్జయిన కారు



కారులో ఇరుక్కున్న మృతదేహాలు



తీవ్రంగా గాయపడిన రాజమోహన్ భార్య లక్ష్మీదేవి

కడప అర్బన్ : ఇంటి నుంచి ఉదయాన్నే బయలుదేరారు.. పోరుమామిళ్ల సమీపంలోని మద్దిమాను గుర్రప్ప స్వామి వద్ద మొక్కు తీర్చుకున్నారు... తిరిగి కడపకు బయలుదేరారు. కడప నగర శివార్లలోకి తాము వెళ్లిన కారులోనే వచ్చారు. సరిగ్గా పదే పది నిమిషాల్లో గమ్యస్థానమైన ఇంటికి చేరుకుంటారు. ఇంతలోపే ఎదురుగా మృత్యుశకటం రూపంలో ఆర్టీసి అద్దె బస్సు వచ్చి ఢీకొంది. దీంతో కారు నుజ్జునుజ్జయ్యింది. కారులో ప్రయాణిస్తున్న నలుగురిలో ఇద్దరు అక్కడికక్కడే దుర్మరణం చెందారు. భార్యాభర్తలైన మరో ఇద్దరు తీవ్రగాయాల పాలయ్యారు. ఈ సంఘటనపై పోలీసుల, మృతుల బంధువులు తెలిపిన కథనం మేరకు వివరాలిలా వున్నాయి.

కడప నగరంలోని భాగ్యనగర్‌కాలనీలో నివాసం వుంటూ మేస్త్రీ పనిచేస్తున్న దూదిశెట్టి రామయ్య (55) ఇటీవల ఎటియోస్ కారు తెచ్చుకున్నాడు. కడప నగరంలోని ఉక్కాయపల్లెకు చెందిన దాదిబోయిన రాజమోహన్(55) రామయ్యకు స్నేహితుడు. ఈక్రమంలో రాజమోహన్ తన కుటుంబ సభ్యులతో కలిసి, రామయ్య వద్ద వున్న కారులో వెళ్లి పోరుమామిళ్ల సమీపంలోని మద్దిమాను వద్ద వున్న గుర్రప్ప స్వామి వద్ద మొక్కుబడి తీర్చుకోవాలనుకున్నారు. ఈ క్రమంలో రాజమోహన్, అతని భార్య లక్ష్మీదేవి (47), వీరి కుమారుడు దాదిబోయిన సాయి గురురోహిత్ (25)తో కలిసి రామయ్య వద్దకు వెళ్లారు. రామయ్య తన కారులో సోమవారం ఉదయాన్నే కడప నుంచి పోరుమామిళ్లకు వారి కుటుంబంను తీసుకుని వెళ్లారు. పోరుమామిళ్ల సమీపంలోని మద్దిమాను గుర్రప్ప దగ్గరికి చేరుకున్నారు. అక్కడ తలనీలాలు సమర్పించి, పూజలు నిర్వహించి తిరిగి కడపకు చేరుకునేందుకు బద్వేల్‌కు వచ్చారు. మార్గమధ్యంలో బద్వేల్‌లో వున్న లక్ష్మీదేవి బంధువుల ఇంటికి వెళ్లారు. తిరిగి కడపకు బయలుదేరారు. కడప నగర శివార్లలో గురుకుల పాఠశాల సమీపంలోకి వచ్చే సరికి తిరుపతికి వెళ్తున్న ఆర్టీసి అద్దె బస్సు వేగంగా వచ్చి వీరి కారును ఢీకొంది. ఈ ప్రమాదంలో రామయ్య, సాయిగురురోహిత్ అనే ఇద్దరు అక్కడికక్కడే దుర్మరణం చెందారు. భార్యాభర్తలు రాజమోహన్, లక్ష్మీదేవిలు ఇద్దరు తీవ్రగాయాలపాలయ్యారు. వీరిని రిమ్స్ ఆసుపత్రిలో చేర్పించారు. మెరుగైన చికిత్స కోసం వారిని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. సంఘటన స్థలాన్ని కడప రిమ్స్ పీఎస్ పోలీసులు పరిశీలించారు. కారులో ఇరుక్కున్న రెండు మృత దేహాలను రిమ్స్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



దూదిశెట్టి రామయ్య (ఫైల్)

కుటుంబ పెద్దను కోల్పోయామనీ..

కడప నగరంలోని భాగ్యనగర్ కాలనీలో నివాసం వుంటున్న దూదిశెట్టి రామయ్య మేస్త్రీ పనిచేస్తూ... అందరితో కలివిడిగా వుండేవాడనీ అతన్ని స్నేహితులు మేస్త్రీ వెంకటేశు, బాలరాజులు ఆవేదన వ్యక్తం చేశారు.

రిమ్స్ క్యాజువాలిటీ వద్ద ఉన్న తమ తండ్రి రామయ్య మృతదేహాన్ని చూసి కుమారులు శ్రీహరి, మహీంద్రారాయల్ తమ కుటుంబపెద్దను కోల్పోయామని బోరున విలపించారు.

నల్ల నువ్వుల లడ్డు.. పోషకాలు మెండు

- ఎముకల ధృడత్వానికి ఎంతో మేలు
- రుచికి ఫిదా అంటున్న పట్టణ ప్రజలు



నల్ల నువ్వుల లడ్డులు



సద్దరొట్టెలు



తోపుడు బండిలో నువ్వుల లడ్డులు విక్రయిస్తున్న షర్ఫుద్దీన్

మదనపల్లె : ఆరోగ్యమే మహాభాగ్యం అన్నారు పెద్దలు. సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలంటే పోషక విలువలతో కూడిన ఆహారం తీసుకోవాలి. నేటి ఆధునిక ప్రపంచంలో ఆరోగ్యకరమైన ఆహారం దొరకడం కష్టమవుతోంది. ఎక్కడ చూసినా ఫాస్ట్‌ఫుడ్స్, జంక్‌ఫుడ్, హానికరమైన పదార్థాలతో ఆహారం తయారీ జరుగుతుండటంతో శక్తి రాకపోగా, క్రమక్రమంగా ఆరోగ్యం క్షీణిస్తోంది. ఇప్పుడిప్పుడే ప్రజల్లో ఆరోగ్యంపై శ్రద్ధ పెరగడం, జీవనశైలిలో మార్పుల కోసం ప్రయత్నించడం ప్రారంభమైంది. ఇప్పుడు ఆరోగ్య అభిలాషులను ఎవ్వరిని కదిపినా దంపుడు బియ్యం, బ్రౌన్ బియ్యం, మిల్లెట్స్ అంటూ సంప్రదాయక ఆహారాల గురించే మాట్లాడుతున్నారు. వీటిని తినేందుకు ఇష్టపడుతున్నారు.

ప్రజలకు సంప్రదాయక ఆహార పదార్థాలపై పెరుగుతున్న ఇష్టాన్ని ఓ వ్యక్తి తన జీవనోపాధిగా ఎంచుకున్నాడు. తోపుడుబండిలో పోషకాలతో కూడిన నల్ల నువ్వుల లడ్డు, సద్దరొట్టెలు, మిల్లెట్స్ లడ్డులు విక్రయిస్తూ, ప్రజలకు ఆరోగ్యంతో పాటు తాను ఆదాయం పొందుతున్నాడు.

శ్రీ సత్యసాయి జిల్లా కదిరికి చెందిన షర్ఫుద్దీన్ ఏడాది క్రితం జీవనోపాధి కోసం మదనపల్లెకు చేరుకున్నాడు. తన వద్ద ఉన్న కొద్దిపాటి మొత్తంతో చేయదగిన వ్యాపారం గురించి అన్వేషించాడు. ఏం చేద్దామన్నా పెట్టుబడులు అధికంగా ఉండటం, పోటీ ఉండటం, జరుగుతుందో లేదో అన్న భయం ఉండటంతో....తనకంటూ ప్రత్యేకత ఉంటే తప్పక నిలుదొక్కుకోగలమని నల్ల నువ్వుల ఉండల తయారీ, అమ్మకం ప్రారంభించాడు. స్వచ్ఛమైన నల్లనువ్వులను తీసుకువచ్చి, వాటిని బాగా శుభ్రపరిచి, మెత్తగా దంచి, వాటికి వేరుశెనగ విత్తనాల పొడి, బెల్లంను కలిపి రుచికరమైన ఉండలు తయారుచేశాడు. ఒకటే ఆహారం అమ్మితే జనాలు ఆసక్తి చూపరని, వాటికి అదనంగా సద్దరొట్టెలు, జొన్న, సజ్జలు, బెల్లం కలిపిన మిల్లెట్స్ లడ్డులు తయారుచేసి తోపుడు బండిలో వేసుకుని మదనపల్లె వీధుల్లో అమ్మడం ప్రారంభించాడు.

నల్లనువ్వుల లడ్డులు అయితే రూ.50కి 2, సద్దరొట్టె(పప్పుల పొడితో) ఒకటి రూ.20, సజ్జ,జొన్న, మిల్లెట్స్ లడ్డు అయితే... రూ.50కి 4 చొప్పున విక్రయిస్తున్నాడు. మొదట్లో వీటిపై అంత ఆసక్తి చూపని పట్టణ ప్రజలు, మెల్లమెల్లగా వీటి పోషకవిలువల గురించి తెలిసిన తర్వాత షర్ఫుద్దీన్ నువ్వుల ఉండల కోసం ఎదురుచూసి మరీ కొంటున్నారు. ఆహా, ఓహో అంటూ ఆనందంగా తింటూ ఆరోగ్యాన్ని కాపాడుకుంటున్నారు.

ఆరోగ్యం.. ఆదాయం..

నల్ల నువ్వుల లడ్డుతో ప్రజలకు ఆరోగ్యం, నాకు ఆదాయం. ఉదయం 6 గంటల నుంచి వీటి తయారీ మొదలుపెడతాను. దాదాపు నాలుగు గంటలు శ్రమిస్తే 10 గంటలకు రుచికరమైన నువ్వుల లడ్డులు తయారవుతాయి. పట్టణంలో అందరికీ వీటి రుచి చూపించాలని ఒకో రోజు ఒకో ప్రాంతానికి వెళ్లి వ్యాపారం చేస్తుంటాను. రోజుకు అన్నిఖర్చులు పోనూ రూ.1,200 ఆదాయం పొందుతున్నాను.

– షర్ఫుద్దీన్, శ్రీ సత్యసాయి జిల్లా, కదిరి

నువ్వుల లడ్డుతో ఆరోగ్యం..



పిల్లలు ఎదిగే క్రమంలో వారికి సరైన పోషకాహారం అందించడం చాలా అవసరం. అలా అందించినప్పుడే వారు శారీరకంగా, మానసికంగా ధృడంగా తయారవుతారు. నువ్వుల్లో కాల్షియం, ఐరన్ అధికంగా ఉన్నందున ఎముకలు ధృడంగా తయారవుతాయి. మధుమేహ వ్యాధిగ్రస్తులు తినడం వల్ల మెగ్నీషియం, ఫైబర్, యాంటీ ఆక్సిడెంట్లు రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో సహాయపడతాయి.

– జీ.వి.ప్రసాద్, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు, మదనపల్లె